సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 145 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 15 అక్టోబర్ 2025 | పేజీలు : 4



## కొడుకు నిర్లక్ష్యంతో తండ్రి మానవీయ నిర్ణయం

- మనసులను కదిలించే మాజీ ఎంపీపీ కథ ఇది..

3 లో



# మహిళా సంక్షేమానికి సర్కారు పెద్దపీట

- పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
- లబ్ధిదారులు వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, అందుకే సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరు మీదనే అమలు చేస్తుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎస్ కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 256 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే డీఆర్ డీఏ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వ్యవసాయ మోటార్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజల స్వంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్రంలో రూ.22,500 కోట్ల ఖర్చుతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 3,500 ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు 3,360 ఇండ్లకు మంజూరు పత్రాలు అందజేశామని, అందులో 95 శాతం ఇండ్ల పనులు ప్రారంభమై వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. రాబోయే 2, 3 నెలలలో మరో 3,500 ఇల్లు రాబోతున్నాయని అర్హులైన వారు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత కలిగిన పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ఎవరికీ కూడా ఒక్క రూపాయి లంచం ఇవ్వవద్దని అన్నారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించుకోవాలని సూచించారు. బిల్లుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బ్యాంక్ అకౌంట్ తో ఆధార్ లింకేజి వంటి వాటిని సరిచూసుకోవాలని తెలిపారు.

ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళల పక్షపాతిగా నిలిచిందని అన్నారు. మహిళలు బాగుపడితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కె వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేస్తుందని చెప్పారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శిస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నాయకత్వంలో ఆ ప్రాంతం అభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో జనగామ, హన్మకొండ జిల్లాల హౌసింగ్ పీడీలు మాత్రు నాయక్, హరికృష్ణ, స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## డిజిటల్ విద్యపై అవగాహన

- విద్యా అభివృద్ధిపై టీచర్లు దృష్టి పెట్టాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా

2 లో






wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# డిజిటల్ విద్యపై టీచర్లకు అవగాహన ఉండాలి

## జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



**జనగామ, మన చౌరాస్తా :** విద్య రంగాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు డిజిటల్ విద్యపై అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఏకశిల బిఈడి కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో డిజిటల్ లిట్రసిపై ఫిజిక్స్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యా బోధన కూడా మారాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందుకు ఉపాధ్యాయులు 6వ తరగతి నుంచే కంప్యూటర్ విద్యపై బోధించాల్సి ఉన్నందున డిజిటల్ విద్యపై పూర్తిస్థాయిలో పరిజ్ఞానం పొందాలన్నారు. డిజిటల్ విద్యా ద్వారా బోధన సులువుగా చేయవచ్చునని విద్యార్థులకు విలువలతో కూడిన విద్య కూడా ప్రస్తుత విద్యార్థులకు బోధించాల్సిన కర్తవ్యం ఉపాధ్యాయులకు ఉందని దిక్సూచి కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో నిర్వహించాలని ఉపాధ్యాయులను కోరారు. కంప్యూటర్ విద్యపై విద్యార్థులు ఆసక్తి కలిగి ఉంటారని ప్రభుత్వం కూడా విద్యలో సాంకేతిక విద్య జోడించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటున్నది అన్నారు. ఉపాధ్యాయులు సాంకేతిక విద్యపై అవగాహనలో తోటి ఉపాధ్యాయులతో చర్చించుకుంటూ సబ్జెక్టులపై నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. దిక్సూచి ప్రోగ్రాంలో భాగంగా సాంకేతిక విద్యను కూడా చాలెంజింగ్ గా తీసుకొని పరిణితి సాధించాలన్నారు. డిజిటల్ విద్యకు పాఠశాలల్లో కంప్యూటర్స్ ఉన్నాయని, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్ బి డిజిటల్ ప్యానెల్స్ కూడా వినియోగించుకోవచ్చునన్నారు. ప్రతి విద్యార్థికి ఆలోచన పెరిగేందుకు దిక్సూచి ప్రోగ్రాం ఉపయోగపడుతుందని, పర్సనల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటివి ప్రతి విద్యార్థికి అవసరం అని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు నిరంతరం సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యా శాఖ ఏఎంఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పనులను పరిశీలించిన



జనగామ మండలం పెంబర్తిలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతంగా జరగాలని జాప్యం తగదన్నారు. పనులు నాణ్యతాపరంగా చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంజిత్ ఉన్నారు.

# వడ్లకు బోనస్ ఎక్కడ..?

- రైతుల కోసం మాట్లాడే నైతిక హక్కు పల్లాకు లేదు
- మాసాపేట రవీందర్ రెడ్డి



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వడ్లకు ఒక్క క్వింటాల్ బోనస్ కూడా ఇవ్వలేకపోయిందని, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి బోనస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాసాపేట రవీందర్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బచ్చన్నపేట మండలంలో చెరువులు నిండడం లేదని, వడ్లకు బోనస్ ఇవ్వడం లేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియా ముందు మాట్లాడడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ ఇవ్వడం ద్వారా రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. తపాసుపల్లి డ్యాం నిర్మాణం అనంతరం జీవోకు విరుద్ధంగా సిద్దిపేట ప్రాంతానికి నీటిని తరలించిన మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కారణంగానే గుడి చెరువు సహా మండలంలోని చెరువులు నిండలేదని పేర్కొన్నారు. వడగండ్ల వర్షాలతో వందలాది మంది రైతులు నష్టపోయిన సమయంలో అప్పటి రైతు బంధు సమితి అధ్యక్షుడిగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి ఒక్క రైతును పరామర్శించకపోవడం, నష్టపరిహారం అందించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. అలాంటి వారు ఈ ప్రాంత ప్రజలపై ప్రేమ ఉన్నట్లుగా మాట్లాడటం విచిత్రమని అన్నారు. అసెంబ్లీలో పల్లా రాజేశ్వర్ రెడ్డి నిజంగా రైతుల పక్షాన ఉంటే నీళ్ల తరలింపును అడ్డుకునేలా పోరాడాలని, లేనిపక్షంలో గ్రామాల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని మాసాపేట రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో గుట్ట డైరెక్టర్ నిమ్మ కరుణాకర్ రెడ్డి, గుర్రపు బాలరాజు, సుభాష్, వద్ది ఎల్లయ్య, మల్లయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని మూడో వార్డులో బాలాజీ నగర్, జ్యోతి నగర్ ఎల్లమ్మ గుడి ఏరియాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని సీపీఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ధర్నా నిర్వహించి కమిషనర్ మహేశ్వర్ రెడ్డికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ బస్టాండ్ కు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి హైదరాబాదు, సూర్యాపేట మెయిన్ రహదారులకు అతి చేరువలో ఉండి అత్యంత అభివృద్ధి చెందిన వార్డుగా బయటి నుంచి కనబడినప్పటికిని అంతర్గతంగా తీవ్రమైన సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా రోడ్లు డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. మున్సిపాలిటీకి ఇంటి పన్నులు బిల్డింగ్ నిర్మాణ అనుమతుల పన్నులు రకరకాల ద్వారా జనగామ పట్టణంలో వస్తున్న ఆదాయంలో పెద్ద మొత్తంలో ఎక్కువ శాతం ఈ మూడో వార్డు నుంచలే సమకూరుతుందన్నారు. మున్సిపాలిటీకి పన్నులు వసూలు చేసుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో లేదని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చొరవ చేసి సందర్శించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, బాలాజీ నగర్ వాసులు బింగి మధు, శ్రీనివాస రెడ్డి, భైరగోని శ్రీనివాస్, మాదూరి బాలయ్య, బస్వా రమ్య, శెంకరి మాధవి, చిట్టిపోలు శ్రీనివాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.







# ఎడెల్లి కావ్యకు డాక్టరేట్



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన ఎడెల్లి కావ్య డాక్టరేట్ పట్టాను సాధించారు. గ్రామానికి చెందిన ఎడెల్లి ఐలయ్య-అన్నపూర్ణ కూతురైన కావ్యది మధ్య తరగతి కుటుంబం. చిన్నటి నుంచి ఎంతో కష్టపడి చదివి ఫార్మసీ, ఫార్మకోగ్నోసి డిపార్ట్మెంట్ లో డాక్టరేట్ పట్టానను సాధించారు. ఈ నెల 13న ఇండియా రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదిగా చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో డాక్టరేట్ ను అందుకున్నారు. అమ్మ, నాన్నల కలని నెరవేర్చిందకు తనకు చాలా సంతోషంగా ఉందని కావ్య తెలిపారు. అలాగే సపోర్ట్ చేసి కుటుంబ సభ్యులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఒగ్గు కథ యూనివర్స్ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ జానపద కళల పట్ల గౌరవభావం, వారసత్వ పరిరక్షణ, మరియు కళాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో "ఒగ్గు కథ యూనివర్స్ అవార్డ్స్ - 2025 ను ప్రారంభిస్తున్నట్లు జిమా ఫిలిం స్కూల్ అధిపతి డా. కుమార స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు తెలంగాణకు ప్రత్యేకమైన జానపద కళ అయిన ఒగ్గు కథను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు రూపొందించబడ్డాయన్నారు. ఈ అవార్డ్స్ ద్వారా కళాకారుల కృషిని గౌరవించడం మాత్రమే కాకుండా, పురాతన కథన సంప్రదాయాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా శాశ్వతంగా నిలుపుదల చేయడం లక్ష్యమన్నారు. ప్రజల కథలు ప్రపంచానికి - తెలంగాణ మట్టిలో నుంచి ప్రపంచ హృదయానికి "ఒగ్గు కథ తెలంగాణ సాంస్కృతిక మూలాల ప్రతిరూపం. ఈ కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రపంచానికి పరిచయం చేయడం మాకెంతో గర్వకారణం. ఆధునిక మీడియా ద్వారా ఈ జానపద కళను కొత్త తరాలకు చేరవేయడమే మా లక్ష్యం" అని తెలిపారు. ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమం నవంబర్ 2025లో హైదరాబాద్‌లోని గ్రాండ్ కల్చరల్ ఆడిటోరియంలో జరుగుతుందన్నారు. "ప్రజల కథలు ప్రపంచానికి" అనే థీమ్ నిర్ణయించామని ఈ వేడుకలో సినీ ప్రముఖులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, మీడియా సభ్యులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు.

### నామినేషన్లకు ఆహ్వానం

ఈ అవార్డులకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒగ్గు కథ కళాకారుల నుండి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు వివరాలకు అక్టోబర్ 20లోగా సెల్ 93469 2811, 95739 57787 లను సంప్రదించాలని కోరారు.



# రైతులను రాజు చేయడమే లక్ష్యం

- **జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్**

**జనగామ, మన చౌరాస్తా :** రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ,అదేవిధంగా రైతులు తమ వడ్లను అరబెట్టుకొని సెంటర్ కి వచ్చే ముందు తగు నాణ్యతలు పాటించాలని, ఏ గ్రేడ్ వడ్లకు రూ.2,389, సాధారణ రకం వడ్లుకు రూ.2,369 మద్దతు ధర ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు విక్రయించ వద్దు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జీవన్ కుమార్, ఏడీఈ అపర్ణ, ఏపీఎం శంకరయ్య, ఏఎంసీ డైరెక్టర్లు నామాల శ్రీనివాస్, బొట్ల నర్సింగరావు, తోటకూరి రమేష్‌యాదవ్, బండ కుమార్, నాగబండి రవీందర్, పర్ష సిద్దేశ్, జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, రైతు సంఘం నాయకులు చందు నాయక్, బీరయ్య, నాయకులు సాదం జంపన్న, రత్నం, జగదీష్, రైతులు శ్రీనివాస్, రమేష్, రాజు, కొమురయ్య, ఏఎంసీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏవో అనిల్, సీసీ వెంకటేష్ పాల్గొన్నారు.

### డాక్టర్ రాజమౌళి ఆర్థిక సాయం

**జనగామ జిల్లాలోని పెంబర్తి పీఏసీఎస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్, ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ రాజమౌళి మంగళవారం ప్రారంభించారు. గ్రామ రైతుల అవసరార్థం రాజమౌళి తనవంతు సహాయంగా రూ.10 వేలు నగదు అందించారు. ఈ నిధులతో రైతులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డాక్టర్ ఆలోచనపై పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు.**




# పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా ప్రకాష్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామంలో ఈ రోజు అఖిల భారత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భీమదేవరపల్లి మండల కమిటీకి కొత్త పదాధికారులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఊసకోయల ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా గాడిపల్లి హరీష్, ఉపాధ్యక్షులుగా చీదురాల కిరణ్ కుమార్, గాజుల చక్రపాణి, సహాయ కార్యదర్శిగా కొండబత్తిని ప్రభాకర్, మండల యువ అధ్యక్షుడిగా ఉడుత శ్రీనాథ్ గారిని హనుమకొండ జిల్లా అధ్యక్షులు బాచ్చు ఆనందం గారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్ గారు ముఖ్య అతిథిగా హాజరై, ఎన్నికైన కొత్త కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నేటి నుంచి సదరం క్యాంపులు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలోని వివిధ రకాల నూతన వికలాంగులు, రెన్యూవల్ ఉన్నవారు మీ సేవలో యూడిఐడి వెబ్సైట్ లో స్లాట్ బుకింగ్ చేసుకున్నవారు రసీదులో ఉన్న ఫోన్ నెంబర్ కు మెసేజ్ వచ్చిన తేదీలలో జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి హాజరుకావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి వసంత కోరారు. ఈనెల 15, 16, 17, 22, 23, 24, 25, 28, 29, 30, 31వ తేదీలలో ఆర్థో, దృష్టి , వినికిడి లోపం, మానసిక, తలసేమియా, క్రానిక్ న్యూరాలజీ, సంబంధిత వికలాంగులకు డాక్టర్ లచే క్యాంపులు నిర్వహించబడు తుందన్నారు. కొత్తవి 419 ఉండగా, రెన్యూవల్ 81 ఉన్నాయని మొత్తంగా 500 మందికి అవకాశం ఉన్నదన్నారు. యుడిఐడి సదరం స్లాట్ బుకింగ్ కు మీ సేవ లో రూ.35 లు మాత్రమే చెల్లించాలని, సదరం సర్టిఫికెట్ లో 40 శాతం కన్నా తక్కువగా ఉండి రిజెక్ట్ అయిన వికలాంగులు మీ సేవలో యుడిఐడి వెబ్సైట్లో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. ఫోన్ కు మెసేజ్ వచ్చినవారు డాక్టర్ రిపోర్టులతో ఆధార్ కార్డు ఫోటో మీసేవ రసీదు తో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన శిబిరానికి హాజరు కాగలరని తెలియజేశారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 8008202287 ను సంప్రదించాలన్నారు.

# రోడ్లు అభివృద్ధి నిధులు మంజూరు

**పాలకుర్తి, మనచ చౌరాస్తా :** ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషితో పాలకుర్తి నియోజకవర్గంలోని గిరిజన తండాలు, శివారు గూడెంలకు మహర్దశ పట్టనుంది. రూ.24.30 కోట్లతో బీటీ రోడ్లు మంజూరయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఎమ్మెల్యేకి మంజూరి పత్రాలను హైదరాబాదులో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఆప్యాయంగా స్వాగతిస్తూ, చెల్లమ్మ, బాగున్నావా అని స్నేహపూర్వకంగా పలకరించారు. ఎమ్మెల్యే మంత్రి సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

### మాగంటి సునీతకు బిఫామ్

# అందజేసిన కేసీఆర్

**హైదరాబాద్, మన చౌరాస్తా :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన మాగంటి సునీతా గోపీనాథ్ కు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరపున రూ.40 లక్షల చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపీనాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితరలు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక జరుగుతున్నది. ఈ సందర్భంగా కెసిఆర్ వారిని ఆశీర్వదించారు.



### కొడుకు నిర్లక్ష్యంతో తండ్రి

# మానవీయ నిర్ణయం


### మనసులను కదిలించే మాజీ ఎంపీపీ కథ

**ఎల్కతుర్తి, మన చౌరాస్తా :** తండ్రి - కొడుకుల బంధం ఎంత బలమైనదో అందరికీ తెలుసు. కానీ, అదే బంధం నిర్లక్ష్యంతో చల్లబడితే? ఆ బాధ తల్లి దండ్రుల హృదయాన్ని చీల్చేస్తుంది. అటువంటి ఆవేదనలోనే హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ గోలి శ్యాంసుందర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ప్రజల మనసులను కదిలిస్తోంది. తన సొంత కొడుకు తమను పట్టించుకోవడం లేదనే బాధతో ఆయనకు ఉన్న ఆరు ఎకరాల భూమిలో మూడు ఎకరాలను ప్రభుత్వానికి దానం చేశారు. అక్టోబర్ 14న రెవెన్యూ అధికారుల సమక్షంలో భూమి హస్తాంతరణ పత్రాలపై సంతకాలు చేశారు.



'జీవితాంతం శ్రమించి సొంతం చేసుకున్న ఈ భూమిని నా పిల్లల కోసం ఉంచాను. కానీ వారు మా కష్టాలను, మమకారాన్ని గుర్తించలేదు. కనీసం ఒకసారి ఆరోగ్యం అడగలేని పరిస్థితి వచ్చింది. అలాంటి వారికి ఈ భూమి ఉపయోగపడకపోవడమే మంచిదని అనిపించింది..' అని కన్నీళ్ల పర్యంతమయ్యారు. శ్యాంసుందర్‌రెడ్డి భార్య కొద్ది నెలల క్రితమే మరణించారు. ఆ దుఃఖాన్ని తట్టుకోలేకపోయిన ఆయన భార్య జ్ఞాపకార్థం ఈ భూమిపై పాఠశాల లేదా అనాథాశ్రమం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. 'ఆమె చిన్నారులను ఎంతో ప్రేమించేది. అందుకే ఆమె పేరుతో పాఠశాల ఏర్పడితే ఆమె ఆత్మ సాంత్వన పొందుతుంది..' అని తెలిపారు.

ఎల్కతుర్తి గ్రామ ప్రజలు ఈ నిర్ణయాన్ని ఆవేదనతో పాటు గౌరవంగా చూస్తున్నారు. గ్రామస్థుడు గోపాల్ మాట్లాడుతూ 'ఇప్పటి కాలంలో పెద్దలు పిల్లల కోసం జీవితాంతం కష్టపడుతున్నారు. కానీ వారసులు తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం బాధాకరం. శ్యాంసుందర్‌రెడ్డి నిర్ణయం ప్రతి యువకుడు ఆలోచించాల్సిన విషయమే..' అన్నారు. తల్లిదండ్రుల ఆప్యాయత, ప్రేమను మించిన సంపద ఈ ప్రపంచంలో లేదని మరోసారి గుర్తు చేసిన ఈ సంఘటన ఎల్కతుర్తి గ్రామానికే కాదు, మొత్తం తెలంగాణకు ఒక మానవీయ పాఠంగా నిలిచింది.






## చిరు.. వెంకీ

టాలీవుడ్‌లో తనదైన శైలిలో కామెడీ, ఎమోషన్ మేళవించి ప్రేక్షకులను మెప్పించిన సూపర్‌హిట్ దర్శకుడు అనిల్ రావిపూడి. మెగాస్టార్ చిరంజీవితో కలిసి 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్ తో ఒక కమర్షియల్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో సినిమా వస్తుందన్న వార్తతోనే ఫ్యాన్స్ ఉత్సాహంలో మునిగిపోయారు. వెంకటేష్‌తో 100 కోట్ల క్లబ్‌లో చేరిన అనిల్.. ఈసారి చిరుతో మరింత భారీ సక్సెస్ అందుకోవడం ఖాయమని మెగా అభిమానులు నమ్ముతున్నారు. ఇకపోతే ఫిలిం సర్కిల్స్‌లో ఈ సినిమా గురించి మరో సెన్సేషనల్ అప్డేట్ హల్‌చల్ చేస్తోంది. అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్లు ఇచ్చిన విక్టరీ వెంకటేష్, ఇప్పుడు చిరు సినిమాలోనూ కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ వార్త చాలా రోజులుగా చర్చనీయాంశమవుతున్నా.. వెంకటేష్ షూటింగ్‌లో పాల్గొనకపోవడంతో కొంత అనుమానం నెలకొంది. అయితే ఇప్పుడు ఆ సందేహాలన్నిటికీ చెక్ పెడుతూ వెంకటేష్ అక్టోబర్ 21 నుంచి మెగాస్టార్‌తో కలిసి షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. అనిల్ రావిపూడి మార్క్ ఫన్‌తో పాటు ఎమోషన్ కలబోసిన పాత్రలో వెంకటేష్ కనిపించబోతున్నారని మేకర్స్ చెబుతున్నారు. దీంతో చిరు, వెంకీ కాంబినేషన్ మళ్లీ తెరపై చూడబోతున్న అభిమానులు సూపర్ ఎక్సైటెడ్‌గా ఉన్నారు. మొత్తానికి, మన శంకర వరప్రసాద్ గారు చిత్రం టాలీవుడ్‌లో సంక్రాంతి బరిలో భారీ సంచలనాన్ని సృష్టించబోతుందనే నమ్మకం పెరుగుతోంది.